# 16. ఆరని ఆశలు

తనకు కొడుకు పుట్టాడనే శుభవార్త విన్నప్పుడు వీరయ్యలో ఎన్నో కొత్త ఆశలు చెలరేగినయ్. ఆ పాతికేళ్ళ వయస్సులోనే 'కొడుకు'ను గూర్చి కూలంకషంగా తెలియకపోయినా, అతని హృదయం ఏదో అనిర్వచనీయ ఆనందానికి గురైంది.

తన యీ కొడుకు కాలక్రమాన పెరిగి పెద్దవాడౌతాడు. చిన్నతనం నుంచే తగిన శిక్షణ ఇస్తూ జాగ్రత్తగా పెంచితే తనలాగా కాకుండా వాడు విద్యావంతుడౌతాడు. తండ్రి తనకు వొదిలివెళ్ళిన ఆస్థిని చెడుస్నేహాలకు అలవాటుపడి దుర్వ్యసనాలకుగాను తను పాడు చేశాడు. ఇకముందు తన యీ కొడుకు అభివృద్ధి కోసం ఎంత డబ్బయినాసరే ఖర్చుపెట్టవలసి వొస్తే తను వెనుకడుగు వేయడు. అందుకుగాను తను యీ క్షణం నుంచే చాలా జాగ్రత్తగా ఖర్చుపెడుతూ, తన శరీరంలో బాగా బలం ఉన్నప్పుడే కష్టించి పనిచేసి మరింత కూడబెట్టి ముందుచూపుతో జాగ్రత్తపడాలి. కొడుకు ముద్దు మురిపాల మాట ఎలావున్నా వాడు పెద్ద చదువులు చదివి పెద్ద ఉద్యోగంలో ఉంటే తన వార్ధక్యమంతా హాయిగా గడిచిపోతుంది. తన వంశంలో కూడా విద్యావంతుడు ఉన్నాడని చెప్పుకో గలుగుతాడు. తన తండ్రికి తనవల్ల వొచ్చిన అపకీర్తిని యీ వంశంలోని తన కొడుకు తెచ్చే కీర్తి మొదలంటా రూపుమాపుతుంది. దాంతోనే తను ధన్యుడౌతాడు. జీవితంలో తను ఏయేపనులు చేసివుంటే బాగుండేదో ఇప్పుడు తెలుస్తూ వుంది. తనకు అప్పుడే ఆ వయస్సులోనే తెలిసి వుంటే ఎంతైనా బాగుండేది. కాని అలా తెలియకపోవటమే జీవిత రహస్యమనే సంగతి పాపం వీరయ్యకు తెలియదు. తను ఏ యే పనులైతే చేయలేకపొయ్యాడో – వాటిని ఇప్పుడుకానీ, ఇక ముందుకానీ చేసే అవకాశం యేమీ లేదు. ఎందుకంటే చేయగలిగిన ఆ రోజులన్నీ గడిచేపోయినవి. అవి మళ్ళీ తిరిగిరావు. కాని అంతమాత్రంచేత తను ఆశలన్నిటినీ వొదులుకో

నవసరంలేదు. తన బదులు ఇప్పుడు జన్మించిన యీ శిశువుకు ఆ అవకాశాలన్నీ ఉన్నాయ్. ముందు ఎంతో గొప్ప జీవితం అతనికోసం ఎదురుచూస్తూ వుంది. తను పైన వుండి, యీ కొడుకుచేత గొప్ప గొప్ప పనులు చేయించి తన కలలన్నిటినీ వీడి జీవితంలో యథార్థ దృశ్యాల్లాగే చూస్తూ ఆనందించగలుగుతాడు!

యీ విధంగా అతను యీ శిశువు ఇరవై ఐదు సంవత్సరాల వయస్సు – తన వయస్సువాడయేప్పటికి ఏమేం పనులు చెయ్యగలుగుతాడో వాటన్నిటినీ 25 నిమిషాల్లోనే ఊహించుకొని గాలిమేడలు కట్టుకున్నాడు.

తన నిశ్చయం ప్రకారం వీరయ్య ఆ క్షణంనుంచే జీవితాన్ని సక్రమ మార్గంలోకి లాక్కున్నాడు. తన మీద ఎంతో బాధ్యత వున్నదనే సంగతి అతను ఎన్నడూ మరిచిపోలేదు. కుర్రాడి ముఖం చూసినప్పుడల్లా అతని హృదయం వికసించిన పుష్పంలాగుండేది. ఎప్పుడన్నా మామూలుకన్న ఎక్కువఖర్చు పెట్టవలసి వస్తే కుర్రాణ్ణి తలుచుకొని అతను ఖర్చు తగ్గించుకునేవాడు. కష్టించి పనిచెయ్యటం మొదలుపెట్టాడు. యీ బరువంతా ఒక్కసారే తన మీద పడితే భరించటం అతికష్టమని తనకు తెలుసు. ఇంత భారాన్నీ తన జీవితంలోని రోజులన్నిటి మీదా సర్దుకోవటం వల్ల అతనికి ప్రతి ఒక్కరోజూ ఒకే మాదిరిగా గడిచిపోతుంది. బరువు లాగుతూన్నట్టే అనిపించదు. తనకిది ఎంతో తేలిక.

రాత్రిళ్ళు కుర్రాణ్ణి గూర్చి ఆలోచనల్తోనే గడిపేవాడు. తన ఆశా సౌధాలకు దిన దినమూ అతను కొత్త మెరుగుల్ని దిద్దేవాడు. తన యీ ఆలోచనల్ని భార్యక్కూడా చెప్పలేదు... అవి కాస్తా తన చేతినుంచి ఇంకెవరికీ పోకూడదని అతని పట్టుదల. ఇతర్లు పంచుకోవటం వల్ల తన ఆనందం తగ్గుతుందని అతని అభిప్రాయం. అంతేకాకుండా తన యీ పావు శతాబ్ద ప్రణాళికను ఇతర్లు విని నవ్వుతారేమోననే భయం కూడా లేకపోలేదు. యీ ఆశల తాలూకు మధురమైన తలపులు అనేక రంగుల్లో అతని బుర్రలో మెరుస్తూన్నంతసేపూ అతనికి తన పనిలోని కష్టం యేమీ కనిపించేది కాదు. ఆ పని తన శక్తికి మించినదైనా అతనికి అలసటగా తోచేది కాదు – సరికదా ఆ పనిలో లోకకళ్యాణం యేదో ఇమిడివున్నట్టుగా తోచి కొత్త ఆనందాన్నిచ్చేది.

తన చిన్నతనంలో ఏ విధంగా చెడిపోయి చదువు అంటకుండా తిరిగాడో ఆ సంఘటనలన్నిటినీ వీరయ్య ఎంతో ప్రయాసపడి జ్ఞాపకం చేసుకున్నాడు. ఆ విధంగా పెరిగితే మాత్రం వీడుకూడా తనలాగే తయారవక తప్పదు. అందుకని వాడు వక్రమార్గాల పడిపోకుండా వీరయ్య వేయి కళ్ళతో కొడుకును కనిపెట్టసాగాడు.

కుర్రాడు దినదిన ప్రవర్ధమానమౌతున్నాడు. తన ఆశయాల ననుసరించి వాడు చెడు నడతలకు గురి కాకపోవటం వీరయ్యకు ఎంతో తృప్తినిచ్చింది. తనలాగా కాకుండా వాడెంతో పట్టుదలతో చదవటం, విద్యాసక్తిని కనబరచటం మొదలైన విషయాలన్నీ వీరయ్యలో సరికొత్త ఆశలకు పునాదులు వేసినయ్. తోడి పిల్లవాళ్ళను చూసి వాళ్ళల్లో

లేని అనేక సద్గుణాలు కొడుకులో ఉండటంవల్ల వీరయ్య గర్వంగా తిరిగే అవకాశం ఏర్పడ్డది.

కుర్రవాణ్ని కాలక్రమేణా పెద్ద చదువులకు పంపే ఏర్పాట్లు చేశాడు. ఏళ్ళ తరబడిగా యీ కుర్రవాడి కోసం కొద్దికొద్దిగా కూడబెట్టిన డబ్బు యీ సమయంలో ఎంతో ఉపయోగపడ్డది. తనకు ఉన్నా లేకున్నా, కుర్రాడికి మాత్రం ఏలోటూ లేకుండా చూడటం వీరయ్య తన విధిగా భావించాడు. కుర్రవాడి ద్వారా తన కోరికల్ని - తనవల్ల సాధింపబడని కార్యాలన్నిటినీ సాధించటమే!

పల్లె వదిలి వీరయ్య కొడుకు పట్టణవాసానికి వెళ్ళాడు. జీవనాధారమైన వ్యవసాయాన్ని వొదిలే అవకాశం లేకపోవటం వల్ల వీరయ్య మాత్రం ఉన్నచోటనే ఉండిపోవలసి వొచ్చింది.

కుర్రాడు తనకు దూరంగా వున్నా వీరయ్య ఆశాజ్యోతి క్షీణించలేదు. వాడు ఎంతో కష్టపడి చదువుతున్నాడనీ, రోజురోజుకూ విజ్ఞానాన్ని సంపాయిస్తున్నాడనీ, ఒకనాటికి ఆ 'పండితుడు'కి తను తండ్రినని చెప్పుకొనే గౌరవం యీ లోకం తనకు కట్టబెడుతుందనీ వీరయ్య అపోహపడ్డాడు. దానికి కారణమల్లా తను వాడికి చిన్నతనం నుంచీ ఇచ్చిన క్రమశిక్షణ! పట్టణంలో కుర్రాడికి చదువు ఎంత అంటుతూ వుందో తెలియదుకాని, డబ్బు మాత్రం విపరీతంగా ఖర్చవుతూ వుంది. వీరయ్య దానికి లెక్కచేసే స్థితిలో మాత్రం లేడు.

సెలవులకు ఇంటికి వొచ్చినప్పుడు వీరయ్య తన కొడుకును గుర్తు పట్టలేకపొయ్యాడు. తను కనివిని ఎరుగని నాగరికతను ఆరాధించటం తనకు చేతకాలేదు. ఆ లోటును యీ పుత్రరత్నం తీరుస్తున్నాడనే కొత్తరకం తృప్తి వీరయ్యకు కలగటంలో ఆశ్చర్యమేమీ లేదు.

కొడుకు చదువు సంధ్య లేమిటో వీరయ్య విజ్ఞానం అర్థం చేసుకునే స్థితి దాటిపోయింది. అర్థమే కానప్పుడు దాన్ని గూర్చిన విచక్షణాజ్ఞానం ఉండటం హాస్యాస్పదం. అందుకనే వీరయ్య ఏ నిశ్చయానికి రాలేకపొయ్యాడు.

కొడుగు నాలుగేళ్లూ పట్టణంలో జీవితాన్ని గడిపి ఇంటికి తిరిగి వొచ్చేప్పటికి, వీరయ్య ఆస్తి యీ కొడుకు జన్మించినప్పుడు ఎంత వుందో అంతే వుంది. అంటే తన ఇరవై రెండు సంవత్సరాల కష్టాన్ని యీ కొడుకు నాలుగేళ్ళల్లో పీల్చేశాడన్నమాట. ఐతేనేం, దానికి నాలుగు రెట్లన్నా సంపాయించలేకపోతాడా అనిపించింది వీరయ్యకు.

యీ క్షణంనుంచే వీరయ్య ఆశాసౌధాలు క్రమంగా కూలసాగినయ్. కొడుకు ఉద్యోగం ప్రయత్నాలేమీ చేయటంలేదు. వాడి నాగరికత, వాడి జీవితానికి చుక్కెదురైంది. వాడూ ఒకింటివాడయ్యాడు కాని - ఆ సంబంధం వీరయ్యకు ఇష్టంలేనిది. పెళ్ళి విషయం కనుక వీరయ్య గట్టిగా అడ్డలేకపొయ్యాడు. కొత్త కోడలితో ఏదోవిధంగా

సరిపెట్టుకునేందుకే అలవాటు పడ్డాడు.

కాని తను కలలుకన్న యీ పండితుడు తనకెందుకూ కొరగాకుండా పొయ్యాడు. తనకు ముసలితనం వడివడిగా ముంచుకొస్తోంది. ఆ సమయానికి తనకేమీ ఆధారం ఉండదు. అప్పుడు తన గతేం కావాలి?

అప్పుడు నిజానికి తన గతి ఏమౌతుందో కాని, ఇప్పుడు మాత్రం ఇన్నాళ్ళుగా కట్టుకున్న ఆశాసౌధాలు నేలమట్టమయినయ్. కొద్దిరోజుల్లోనే అనేక సంవత్సరాలు పైబడ్డట్టనిపించింది వీరయ్యకు. అనుకున్నదానికన్నా త్వరగా ముసలివాడైనట్టు తోచింది.

ఎన్నో విధాలుగా కొడుక్కు చెప్పి చూశాడు. కాని వాడు, ఆ విద్యాధికుడు, పండితుడు, తనకు అలివయేట్టు లేడు. వాడి ఆశయాలకూ తన ఆశయాలకూ పొత్తు కుదరటం లేదు. ఒక్కడే కొడుకవటం వల్ల వీరయ్య కష్టమో సుఖమో ఒకేచోట పడివుండక తప్పలేదు.

వీరయ్యకు మనమడు పుట్టాడు. ఆ కుర్రవాడ్ని చూచినప్పుడు వీరయ్య ఒక వరస చవిచూసి వొదిలిన కలలన్నీ తిరిగి చిగిర్చినయ్. తన కొడుకువల్ల కూడా తన ఆశలు తీరలేదు. కాని యీ మనమడు, వీడివల్లనైనా తీరకపోతయ్యా?

తను పెరిగిన అనుభవం, తన కొడుకును పెంచిన అనుభవం, వీటిని మేళవించి యీ మనమణ్ని పెంచితే వీడైనా ఎక్కిరాకపోతాడా? సుశిక్షణలో తనకు ఎంతో నమ్మకం వుంది. చివరిసారిగా వీడిమీద చేసే ఏ ఎక్స్‌పరిమెంటూ వృథా కాకూడదు.

యీ కొత్త ఆశల్తో వీరయ్యకు తన వయస్సు పదేళ్ళు వెనక్కు నడిచినట్టనిపించింది. ఆనాటినుంచే అతను కొత్త ఉత్సాహంతో కష్టపడి పని చేయసాగాడు. ప్రతిరోజూ యీ మనమణ్ని చూసి మురిసిపొయ్యేవాడు. వాడి తండ్రికి వాడంటే లెక్కలేదు, కాని యీ తాతకు మాత్రం వాడెంతో విలువైన వస్తువు.

లేని శక్తిని కల్పించుకున్నందువల్ల, అనుకున్నదానికన్న త్వరలోనే వీరయ్య బలహీనుడవసాగాడు. అనుకున్నంత తేలిగ్గా రోజులు గడవటం లేదు. సంసార భారమంతా తనే మొయ్యవలసివొచ్చినందువల్ల వీరయ్య పని మరీ ఘోరమైంది. ఎన్ని పిచ్చి ఆశలున్నా, ఆ ఆశల్ని దాచుకునేందుకు స్థానంలేకపోవటంవల్ల వీరయ్య ఆలోచనల పునాదులే కదలసాగినయ్.

యీ సమయంలో కొడుకు కాస్త ఉపయోగపడ్డాడు. స్వతంత్ర జీవితంపైన అభిలాష ఉండటం వల్ల వాడు కూడా సేద్యంలో తండ్రికి ఉపయోగపడసాగాడు. పూర్తిగా కాకపోయినా కొంత విశ్రాంతి దొరికినందుకు వీరయ్య ఎంతో ఆనందించాడు.

చంపుకు తీరాలేమోనన్న ఆశల్ని తిరిగి రేకెత్తించుకున్నాడు. కొడుకు కూడా తనకు సహాయం చేస్తూండటంవల్ల మనమడి విషయంలో వీరయ్య మధురతమ స్వప్నాల్ని కనసాగాడు.

కేవలం తన శిక్షణలోనే పెరుగుతూన్న మనమడి ప్రవర్తన వీరయ్యకు ఎంతో తృప్తి నిచ్చింది. ఇతర పనులన్నిటికన్నా మనమడి విషయంలో అతనెంతో శ్రద్ధ తీసుకోసాగాడు.

ముసలితనం బాగా పైన పడ్డందువల్ల వీరయ్య ఇంట్లోనే ఉంటున్నాడు. సంసార భారమంతా కొడుకే వహించవలసిన అవసరం ఏర్పడ్డది. వహిస్తున్నందుకు వీరయ్య తన విధిని మొక్కుకున్నాడు.

యీ ముసలితనంలో కూడా వీరయ్య మనమణ్ని అనేక విధాలుగా పరీక్షించాడు. ఏ దుర్నక్షత్రమన్నా వాణ్ణి జీవితంలో తప్పుదారులకు లాగుతుందేమోనని వీరయ్య శతవిధాలుగా రక్షణను ఇస్తూనే వున్నాడు.

వాడూ చదువులో పైకెక్కి వొస్తున్నాడు. కొడుకు కన్నా వీడు చురుకైనవాడు. వాడికన్నా తెలివైనవాడు. తన జీవితపుటాశలన్నీ వీడిద్వారా సఫలీకృతమవక తప్పదు.

కాని వీరయ్య పొరబడ్డాడు. వాడు అనుకున్నదానికి విరుద్ధంగా మారాడు. యీ పాతిక సంవత్సరాల్లోనూ వాడెప్పుడు, ఎక్కడ చెడిపొయ్యాడో, తన రక్షణ ఎక్కడ దారితప్పిందో వీరయ్యకు అర్థం కాలేదు. సరిగ్గా తను వీడి యీడులో ఉన్నప్పుడు ఎలా ఉండే వాడో వీడూ అలాగే తయారయ్యాడు. తన జీవితాన్ని అనుభవించింది తనే కనుక ఎక్కడ దెబ్బతిన్నాడో తనకు తెలిసే అవకాశం వుంది కాని - ఇంకోరి జీవితంలోని అదే లోటును కనిపెట్టటం తనకు మించిన పని.

వీరయ్య మంచంలోనుంచి లేవటంలేదు. ఇక లేచి యీ లోకంలోని పనుల్ని చేసే అవసరం కూడా కొద్దిరోజుల్లోనే పోతుందని అతనికీ తెలుసు. తన ఆశలేమీ తీరలేదు. అంతమాత్రంచేత ఆ కఠినవిధి తన నీ లోకంలో ఉండనివ్వదు.

వీరయ్యకు మునిమనమడు పుట్టాడు. అవసాన కాలమప్పుడు ఆ శిశువును వీరయ్య చూశాడు. ఇంతవరకూ నిరాశా హృదయంతో వున్న వీరయ్య, ఇప్పుడు తన ఆశాజ్యోతిని యీ మునిమనమడి సహాయంతో వెలిగించుకోసాగాడు. తన కుటుంబంలో కొత్తగా ప్రవేశించిన యీ శిశువు పెరిగి పెద్దవాడై తనూ, తన కొడుకూ, తన మనమడూ కూడా చెయ్యలేని పనులన్నిటినీ చేయగలుగుతాడనే గుడ్డి ఆశ ఏదో అతని హృదయాన్ని ప్రజ్వరిల్ల జేసింది.

కాని ఆ ఆశలు ఎంతవరకూ ఫలించినవో తెలుసుకునేందుకు వీరయ్యకు వ్యవధి లేదు. ఏ విషయాల్నయితే అతను ఊహించుకున్నాడో, ఆ ఊహాలతోనే అతను పరలోక యాత్రకు సిద్ధమయ్యాడు.

- *అక్టోబర్, 1948*